# 100వ ప్రపంచ వేదవ్యాపక దినోత్సవము

## పరిశుద్ధ లియో XIV పాపుగారి సందేశము

### క్రీస్తులో ఏకత్వం, సువార్తా వ్యాప్తిలో ఐక్యత

**ప్రియ సహోదరీ సహోదరులారా !**

శ్రీసభకు అత్యంత ప్రియమైన **"ప్రపంచ వేదవ్యాపక దినము 2026"** 11వ భక్తినాథ పాపుగారిచే స్థాపించబడి నేడు శతాబ్ది వేడుకలకు చేరుకున్న నేపథ్యంలో **"క్రీస్తులో ఏకత్వం - సువార్తా వ్యాప్తిలో ఐక్యత"** అన్న అంశాన్ని నేను ఎంచుకున్నాను. జూబిలీ సంవత్సరము తర్వాత యావత్ శ్రీసభ, పవిత్రాత్మలో ఆనందంతోనూ, ఉత్సాహంతోనూ తన ప్రేషిత (మిషనరీ) ప్రయాణాన్ని కొనసాగించుటకు నేను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాను. దీనికోసం క్రీస్తులో ఐక్యమైన హృదయాలు, సఖ్యతతో కూడిన సంఘాలు మరియు అందరిలోనూ దాతృత్వం, నమ్మకంతో సహకరించే సుముఖత ఎంతో అవసరం.

**"క్రీస్తులో ఏకత్వం - సువార్తా వ్యాప్తిలో ఐక్యత"** గురించి మనం ధ్యానించే సమయంలో, దైవకృప ద్వారా మార్గనిర్దేశం చేయబడుటకు, ప్రేరేపించబడుటకు, మనలోని ప్రేషిత పిలుపు జ్వాలను నూత్నీకరించుకొని, శ్రీసభ చరిత్రలో ఈ నూతన ప్రేషిత యుగములో అందరము కలిసి అంకితా భావముతో ముందుకు సాగుదాం. **(Homily, Jubilee of the Missionary World and of Migrants 05 October 2025)**

#### 1. క్రీస్తులో ఏకత్వం : ఆయనలో ఏకమయిన ప్రేషిత శిష్యులు మరియు మన సహోదరీ సహోదరీలు

క్రీస్తులో ఏకత్వము యొక్క రహస్యము ప్రేషిత కార్యం యొక్క గుండెలో వుంది. క్రీస్తు తన శ్రమలకు ముందు తండ్రిని ఇలా ప్రార్థించారు. "వారందరు ఒకరుగా ఐక్యమై ఉండునట్లు ప్రార్తించుచున్నాను. ఓ తండ్రీ! నేను నీయందును, నీవు నాయందును ఉండునట్లు వారిని మనయందు ఉండనిమ్ము" (యోహా 17:21) ఈ మాటలు యేసు యొక్క ప్రగాఢమైన కోరికను, అలాగే తన శిష్యుల సంఘముగా శ్రీసభ ఉనికిని తెలియబరుస్తున్నాయి. ఇది త్రీత్వం నుండి ప్రవహిస్తూ, త్రీత్వం ద్వారానే కొనసాగించబడు ఒక సహవాసం. మానవులందరి మధ్య సోదరభావాన్ని నెలకొల్పుటకు మరియు సమస్త సృష్టితో సామరస్యాన్ని నెలకొల్పుటకు సేవలందించే ఒక సహవాసము.

క్రైస్తవుడిగా ఉండడమంటే ఆచారవ్యవహారాలు, భావాలు ప్రధానం కాదు. అది క్రీస్తుతో ఏకము కావడం ద్వారా, తండ్రి పవిత్రాత్మలతో ఆయన పుత్రత్వములో భాగం పంచుకొనే జీవితం. ద్రాక్షావల్లి యందలి కొమ్మల మాదిరిగా క్రీస్తునందు నివసిస్తూ (చూ.యోహా 15:4) త్రీత్వము యొక్క జీవములో లీనమవ్వడమే దీని భావం. ఈ ఐక్యత విశ్వాసుల మధ్య పరస్పర సహవాసానికి బాటలు వేస్తుంది మరియు అన్ని ప్రేషిత ఫలాలకు మూలము అవుతుంది. వాస్తవానికి పు.రెండవ జాన్ పౌలు పాపుగారు బోధించినట్లు, ప్రేషిత కార్యము యొక్క మూలమునకు, ఫలమునకు సహవాసము ప్రతినిధిగా వుంటుంది. **(Apstolic Exhortion "Christfidelis Laici, 32)**

ఈ సందర్భంలోనే, శ్రీసభ యొక్క ప్రధాన ప్రేషిత బాధ్యత ఏమిటంటే, శ్రీసభ సభ్యుల మధ్య ఆధ్యాత్మిక మరియు సోదర భావముతో కూడిన ఏకత్వాన్ని పునరుద్దరిస్తూ కొనసాగించడము. అనేక సందర్భాలలో మనం విభేదాలు, విభిన్న అభిప్రాయాలు, అపార్థాలు మరియు ఒకరిని మరొకరు నమ్మలేని విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాము. ఇవే మన సంఘాలలో జరిగినప్పుడు, అవి మన సాక్ష్యమును బలహీనపరుస్తాయి. క్రీస్తు తన శిష్యులకు అప్పగించిన వేదవ్యాపక (సువార్త) పరిచర్య, సఖ్యతపడి, సహవాసానికి ఆతురతపడే హృదయాలను అన్నిటికంటే ముఖ్యంగా కోరుతుంది. తత్ఫలితంగా నైసియా సభ 1700వ వార్షికోత్సవ వేడుకలను

అన్ని క్రైస్తవ శాఖలు కలిసికట్టుగా చేసుకొనుటకు అవసరమైన ప్రయత్నాలను తీవ్రతరం చేయడం ఎంతో ముఖ్యం. చివరిగా అయినా చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే, **"క్రీస్తులో ఐక్యంగా ఉండడం"** అనేది మనలను క్రీస్తుపై మన దృష్టిని కేంద్రీకరించమని పిలవడమే! తద్వారా ఆయన నిజంగా మన జీవితాలకు, సంఘాలకు కేంద్రముగాను మనమాట, చర్య, వ్యక్తుల మధ్య అనుబంధాలకు కేంద్రముగా ఉంటూ మనలను **"ఇకనుండి జీవించేది నేనుకాదు, నాలో వున్న క్రీస్తే నివశిస్తున్నాడు"** (గలతీ 2:20) అని ఆశ్చర్యానందాలతో చెప్పడానికి పురికొల్పుతుంది. ఆయన మాటలను నిరంతరం వినడము ద్వారాను, దివ్య సంస్కారముల కృప ద్వారా మనము శ్రీసభలో సజీవశిలలుగా మారడం సాధ్యమవుతుంది. నేడు ద్వితీయవాటికను మరియు పాపుగార్ల ప్రత్యేకంగా దివంగత ఫ్రాన్సిస్ పాపుగారి అధికారిక పత్రాల యొక్క ప్రాధమిక అంశాలను చేపట్టడానికి శ్రీసభ పిలువబడుతుంది. వాస్తవానికి పు.చిన్నప్ప గారు చెప్పినట్లుగా "మనలను మనము ప్రకటించుకొనము. కాని యేసుక్రీస్తునే ప్రభువుగా ప్రకటిస్తాము. (2 కొరింత 4:5) ఈ కారణంగానే పు.6వ పౌలు పాపుగారు పలికిన దేవుని కుమారుడైన నజరేతు యేసుని రహస్యము, ఆయన నామము, ఆయన బోధనలు, ఆయన జీవితము, వాగ్దానాలు మరియు దైవరాజ్యము ప్రకటించబడకపోయినట్లయితే అది నిజమైన సువార్తా ప్రకటన కానేరదు" అను మాటలను నేనిక్కడ పునరుద్ఘాటిస్తున్నాను. **(Apostolic Exhortation Evangeli Nunciadi, 22)** నిజమైన సువార్తీకరణా ప్రక్రియ సకల మానవాళిని చేరుకొనుటకు ప్రతి క్రైస్తవుని హృదయములోనే ప్రారంభమవుతుంది.

కాబట్టి మనం క్రీస్తులో ఎంత ఐక్యంగా ఉంటే, అంతగా మనమంతా కలసి మనకు అప్పగించబడిన సువార్తా పరిచర్యను సమర్ధవంతంగా చేయగలము.

## 2. సువార్తా పరిచర్యలో ఏకత్వం : క్రీస్తు ప్రభువును ప్రపంచము విశ్వసించునట్లుగా.......

శిష్యుల ఐక్యత అనేది కేవలం ఐక్యతతోనే సరిపోదు. అది సువార్తా పరిచర్యవైపు మళ్ళించబడుతుంది. యేసు ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పారు. **"తద్వారా నీవు నన్ను పంపితివని లోకము విశ్వసించుటకు"** (యోహాను 7:21). కనుక సఖ్యత పడినవారి సాక్ష్యము, సోదర భావము, ఏకత్వము కలిగిన సంఘము ద్వారానే సువార్తా ప్రకటన సంపూర్ణ భావవ్యక్తీకరణ శక్తిని పొందుతుంది. ఈ దృక్పధం నుండే ధన్య పావులోమన్నాగారి "యావత్రపంచ సువార్తీకరణకు అన్ని క్రైస్తవ శాఖల ఏకత్వము" అన్న నినాదాన్ని జ్ఞాపకం చేసుకోవడం ఎంతో అవసరం. ఇది 1916లో పొంతిఫికల్ మిషనరీ యూనియన్‌ను ఏర్పాటు చేయడానికి స్ఫూర్తిని, ప్రేరణను కలిగించిన సంక్షిప్త ఆదర్శమును వ్యక్తపరుస్తుంది. ఆ సభ 110వ వార్షికోత్సవ సందర్భమున, సువార్తా పరిచర్య స్ఫూర్తి కలిగిన గురువులను దైవాంకిత వ్యక్తులను, సాధారణ విశ్వాసులను సకలవిధ సువార్తా పరిచర్య ఏకత్వానికి నిబద్ధతతో ప్రేరేపిస్తూ వారిని సిద్ధపరుస్తున్నందుకు నేను ఆ సంస్థకు కృతజ్ఞతలు, దీవెనలు అందచేస్తున్నాను. వాస్తవానికి జ్ఞానస్నానం పొందిన ఏ వ్యక్తి దీనినుండి మినహాయింపు పొందడానికిగాని, ఉదాసీనతతో ఉండడానికి కాని అవకాశము లేదు. ప్రతివ్యక్తి తమ తమ వ్యక్తిగత పిలుపు అనుసరించి, జీవనస్థితిగతులను బట్టి, క్రీస్తు శ్రీసభకు అప్పగించిన ఈ గొప్ప పరిచర్యలో పాల్గొనవలసియుంది. ఫ్రాన్సిస్ పాపుగారు పదే పదే మనకు జ్ఞాపకపరచినట్లు, సువార్తను ప్రకటించడము అనేది ఎల్లప్పుడూ సామరస్యముతోను, సామాజికపరమైన, అందరి భాగస్వామ్యముతో కూడిన ఒక చర్య. ఈ కారణం చేతనే వేదవ్యాపకంలో (సువార్తా పరిచర్యలో) ఏకత్వం అంటే సహవాసము, వేదావ్యాపక సహకారము యొక్క ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ దీనిని సంరక్షించడమే! ఈ వైఖరిని పెంపొందించడము ద్వారా మన సహోదరీ సహోదరులను విశ్వాసనేత్రములతో చూడడము ఎలాగో దైవకృప మనకు క్రమంగా బోధిస్తుంది. దానితోపాటు ప్రతివ్యక్తిలో ఆత్మ ప్రేరేపించు మంచిని ఆనందంగా గుర్తించడము, వైవిధ్యాన్ని ఒక నిధిగా ఆహ్వానించడము, ఒకరి భారములను మరొకరు మోయడం (భరించడము) మరియు పైనుండి వచ్చు ఏకత్వమును అన్వేషించడము కూడా మనము నేర్చుకుంటాము. వాస్తవానికి "ఒకే ప్రభువు, ఒకే విశ్వాసము, ఒకే జ్ఞానస్నానము, ఒక దేవుడు, మానవులందరకు ఒకే తండ్రి. ఆయన అందరకు పైగా అందరి ద్వారా, అందరియందు ఉండువాడు." (ఎఫెసీ 4:5-6) లోని ఒకే సువార్తా పరిచర్యలో పాలు పంచుకుంటాము. ఈ ఆధ్యాత్మికత వేదవ్యాపక శిష్యుల రోజువారీ వ్యక్తీకరణను ఏర్పాటు చేస్తుంది. ఇది విశ్వ శ్రీసభ యొక్క సువార్తా వ్యాప్తి పరిచర్య యొక్క సార్వత్రిక దృష్టిని తిరిగి సాధించడానికి, సమన్వయ ప్రయత్నాల కొరతను అధిగమించడానికి, ఒకే ప్రభుని అనుసరగణముల మధ్య "నేను పౌలు అనుచరుడను, నేను అపొల్లో అనుచరుడను" (చూ.1 కొరింతి 1:10-12) అను వర్గ సృష్టీకరణను అధిగమించుటకు ఎంతో సాయపడుతుంది.

సువార్తా పరిచర్య ఐక్యతను ఏకరూపముగా అర్థం చేసుకోగూడదు. కాని ఒకే ఉద్దేశ్యము లేక లక్ష్యం కోసం విభిన్న సేవల కలయికగా అర్థం చేసుకోవాలి. మరో మాటలో చెప్పాలంటే క్రీస్తు ప్రేమను ప్రత్యక్షపరుస్తూ, ఆయనను కలుసుకోవడానికి అందరనూ ఆహ్వానించడమేనని వేరుగా చెప్పనవసరము లేదు. స్థానిక సంఘాలు ఒకదానితో నొకటి సహకరించినప్పుడు మరియు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, దైవార్చనా వ్యత్యాసములు సంపూర్ణంగాను, సామరస్యంగానూ ఒకే విశ్వాసములో వ్యక్తీకరించబడినప్పుడు మాత్రమే సువార్తీకరణ సాధించబడుతుంది. అందువల్ల శ్రీసభలోని అన్ని సంస్థలు తమ సాంఘిక వేదవ్యాపక ఐక్యతా భావాన్ని బలోపేతం చేసుకోవాలని మరియు వేదవ్యాపకము కొరకు సువార్తా పరిచర్యతో ఒకరికొకరు సహకరించుకునే సృజనాత్మకమైన మరియు నిర్దుష్టమైన మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని నేను ప్రోత్సహిస్తున్నాను.

ఈ నేపధ్యంలో పెరులో నా పరిచర్య సమయంలో నేను కృతజ్ఞతతో పొందిన అనుభవాన్నిబట్టి పొంతిఫికల్ మిషన్ సొసైటీలు (పాపుగారు సభలు) వేదవ్యాపకములో తాము అందించే సహకారానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. వేదవ్యాపక సభ, పవిత్ర బాల్యసభ, అపోస్తుడైన రాయప్ప సభ మరియు పోంతిఫికల్ మిషనరీ యూనియన్ అను ఈ సభలు ప్రపంచ వ్యాప్తముగ తమ ప్రార్థనల ద్వారా, ఉదారత ద్వారా వివిధ సంఘాలమధ్య అనుసంధాన్ని నెలకొల్పుతూ అన్ని తరాల విశ్వాసులలో వేదవ్యాపక అవగాహనను పెంపొందించి, బలోపేతము చేయడము కొనసాగిస్తున్నాయి. వేదవ్యాపక సభ వ్యవస్థాపకురాలు ధన్య పౌలీన మేరి జారికట్, రెండు వందల సంవత్సరాల క్రితమే సజీవ జపమాల (Living Rosary) ను స్థాపించారన్న విషయము ఇక్కడ గమనార్హము. ఇది నేటికీ ప్రపంచవ్యాప్తంగా అనేకమంది విశ్వాసులు కలిసికట్టుగా ప్రతి ఆధ్యాత్మిక, వేదవ్యాపక అవసరముల నిమిత్తము ప్రార్థించునట్లు కొనసాగిస్తుంది. వేదవ్యాపక సభ ప్రతిపాదనను అనుసరించే 11వ భక్తినాథ పాపుగారు 1926వ సంవత్సరములో “వేదవ్యాపక ఆదివారము”ను స్థాపించారన్న విషయాన్ని మనమిక్కడ గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈరోజున సేకరించే వార్షిక కానుకలను పాపుగారి తరఫున శ్రీసభ సువార్త పరిచర్యలోని వివిధ అవసరాలకు ఈ సభ పంపిణీ చేస్తుంది. అందువలన ఈ నాలుగు పాపుగారి సభలు, ప్రతి సభ తనదైన ప్రత్యేక పరిచర్యలోనూ, అన్నీ కలిసికట్టుగానూ ఇప్పటికీ విశ్వ శ్రీసభలో అమూల్యమైన పాత్రను పోషిస్తున్నాయి. ఏకత్వానికి, శ్రీసభ వేదవ్యాపక పరిచర్య సహవాసానికి అవి సజీవ సంకేతాలు. ఆ సంస్థలతో కలిపి కృతజ్ఞతా భావముతో పనిచేయుటకు నేను ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నాను.

**3. ప్రేమ పరిచర్య : విశ్వాసపాత్రమైన దేవుని ప్రేమను ప్రకటించుట, జీవించుట, పంచుకొనుట, :**

ఐక్యత అనేది సువార్తా పరిచర్య స్థితి అయితే, ప్రేమ దాని సారము. ప్రకటించడానికి పంపబడిన మనము ప్రపంచానికి ప్రకటించే ఆ శుభవార్త, ఒక ఆదర్శ సంగ్రహము కాదు; యేసుక్రీస్తు ముఖముగా, జీవితముగా శరీరధారియైన దేవుని విశ్వాస పాత్రమైన ప్రేమ సువార్త. ప్రేమ నుండి పుట్టి, ప్రేమలో జీవించి, ప్రేమకు దారితీసే క్రీస్తు పరిచర్యను పవిత్రాత్మలో కొనసాగించడమే క్రీస్తు శిష్యుల మరియు యావత్ శ్రీసభ యొక్క లక్ష్యం. వాస్తవానికి ప్రభువే తన శ్రమలకు ముందు తండ్రికి చేసిన ఉత్తమ ప్రార్థనలో, శిష్యుల మధ్య ఏకత్వాన్ని గూర్చి ప్రార్థించిన అనంతరం **“నీవు నాయందు కనబరచిన ప్రేమ వారియందు ఉండునట్లు, నేను వారియందు ఉండునట్లు...”** (యోహా 17:26) అంటూ ముగిస్తున్నారు. క్రీస్తు ప్రేమచే ప్రేరేపించబడిన అపోస్తులులు అప్పుడు క్రీస్తు కోసం సువార్తను ప్రకటించడానికి బయలుదేరారు. (చూ.2 కొరింతి 5:14) ఆ విధముగానే శతాబ్దాల తరబడి, అనేకమంది క్రైస్తవులు, వేద సాక్షులు, వేదాంతులు, సువార్తా పరిచారకులు ఈ దైవ ప్రేమను ప్రపంచానికి తెలియచేయుటకు తమ ప్రాణాలను అర్పించారు. అందువలన ప్రేమపూరిత పవిత్రాత్మ ద్వారా మార్గనిర్దేశం చేయబడిన, శ్రీసభ వేదవ్యాపక (సువార్త) పరిచర్య అంత్యకాలము వరకు కొనసాగుతుంది.

నేటి “అద్‌జెంతెస్” ఆధునిక సువార్తా పరిచారకులకు నా ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్నాను. పునీత ఫ్రాన్సిస్ శౌరివారి మాదిరిగా తమ మాతృభూమిని వారి కుటుంబాలను, అన్నివిధాల భద్రతను సువార్త పరిచర్య కోసము, క్రీస్తును ఆయన ప్రేమను, తరచూ సవాళ్ళతో కూడిన, పేద, ఘర్షణలతో నిండిన మరియు తమ సంస్కృతులకు భిన్నంగా వున్న ప్రదేశాలలో తెలియజేయడం కోసము త్యాగము చేస్తున్నారు. ప్రతికూలతలు ఎన్ని వున్నా, మానవ పరిమితులు ఎదురైనా వారు ఆనందముతో తమను తాము అర్పించుకుంటున్నారు. ఎందుకంటే మనం అందించగల గొప్ప సంపద కేవలం క్రీస్తు, ఆయన సువార్త మాత్రమే అని వారికి తెలుసు. దైవ ప్రేమ అన్ని అడ్డంకులను అధిగమిస్తుందని తమ పట్టుదల ద్వారా ప్రదర్శిస్తారు. ఇలాంటి సాహసోపేతులైన

సువార్త సాక్షులు, నేటి ప్రపంచానికి ఎంతో అవసరము మరియు శ్రీసభ సువార్తా పరిచర్యకు నూతన దైవపిలుపులు క్రైస్తవ సంఘాలకు అవసరమై వుంది. ఎల్లప్పుడూ వారిని మన హృదయాలలో వుంచుకొని అనునిత్యము వారికోసం దేవుణ్ణి ప్రార్థించాలి. భూదిగంతముల వరకు సువార్తను ప్రకటించుటలో సమస్తమును పరిత్యజించి క్రీస్తును అనుసరించుటకు సంసిద్ధత కలిగిన యువతను, పెద్దలను దేవుడు మనకు బహుమతిగా ఒసగునుగాక!

సువార్తా పరిచారకులైన స్త్రీ, పురుషులను ప్రశంసిస్తూ, క్రీస్తునందలి మన జీవిత సాక్ష్యము ద్వారాను, మన ప్రార్థనల ద్వారాను, మరియు వేదవ్యాపకమునకు మనమిచ్చే కానుకల ద్వారాను వారు చేయు వేదవ్యాపక పరిచర్యలో వారితో కలిసి సహ భాగస్వాములు కావాలని యావత్ శ్రీసభకు నేను ప్రత్యేక విజ్ఞప్తి చేస్తున్నాను. పు.అస్సీసిపుర ఫ్రాన్సిస్‌గారు చెప్పినట్లుగా **"ప్రేమ ప్రేమించబడదు"** మరియు ఆయన పరలోకములోనికి ప్రవేశించిన 800వ వార్షిక సందర్భమున ఆయనను ప్రత్యేక భావముతో అర్థము చేసుకుందాము. ప్రభుని ప్రేమలో జీవిస్తూ, ఆ ప్రేమను దగ్గర వారికి, దూరం వారికి అందించాలన్న ఆయన ప్రగాఢమైన కోరిక నుండి ప్రేరణను పొందుదాము. ఎందుకంటే **"ఈ ప్రేమ, మనలను అమితంగా ప్రేమించినవాడు, అమితంగానే ప్రేమించబడాలి"** (పు.బొనవెంతూర్, పు.ఫ్రాన్సిస్ జీవిత చరిత్ర 11 అధ్యా.1) అని ఆయన అన్నారు.

అదే విధంగా **"యేసుని ప్రేమిస్తూ, ఆయన ప్రేమించబడేటట్లు చేయడం"** అన్న నా ప్రగాఢమైన కాంక్షతో **"ఈ లోకంలో ఇప్పుడు ఏమి చేస్తున్నానో దాన్నే పరలోకంలో కూడా కోరుకుంటాను"** అంటూ తన మరణం తరువాత కూడా తన పరిచర్యను కొనసాగిస్తానన్న బాలయేసుని చిన్నతెరేజమ్మ చేసిన ఉత్సాహపూరిత ప్రకటన నుండి కూడా మనము స్ఫూర్తిని పొందాల్సి వుంది. **(Letter 220 to 1Abbe Belliere, 24 Feb. 1897).**

ఈ సాక్ష్యాల ద్వారా మనము ప్రేరణ పొంది, మనం పొందిన పిలుపు, వరానుగ్రహాలను బట్టి, అన్ని వేళల ప్రేమపూర్వక పనియైన వేదవ్యాపక పరిచర్యకు మనమంతా అంకితాభావంతో మన సహకారాన్ని అందిద్దాము. ప్రత్యేకంగా ప్రపంచ వేదవాపక దినమున ప్రార్థనలు, ఆచరణాత్మక మద్దతు ప్రత్యేకంగా అత్యంత పేదవారు మరియు అవసరబాధితులకు అందరకూ దేవుని ప్రేమ అను సువార్తను అందించుటకు చాలా గొప్ప సహాయం అవుతుంది. ప్రతి బహుమతి అది ఎంత చిన్నదైనా సరే వేదవ్యాపక సహవాసానికి చాలా అర్థవంతమైన క్రియ అవుతుంది. **"ప్రపంచ వ్యాప్తముగా ఉన్న వేద పరిచారకులకు సహాయము చేయుటకు మీరు చేస్తున్న ప్రతిదానికి నేను మరలా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.** (ప్రపంచ వేదవ్యాపక దిన సందేశము 2025, అక్టోబరు 19) అందరియందు ఆధ్యాత్మిక సహవాసాన్ని పెంపొందించడానికి ఈ చిన్ని ప్రార్థన ద్వారా నా ఆశీస్సులు మీకు అందిస్తున్నాను.

**పవిత్రుడవైన తండ్రీ!** ఎల్లప్పుడూ ఐక్యపరచి నూత్నీకరించే క్రీస్తు ప్రేమలో మమ్ము ఒకటిగా చేయండి. శ్రీసభ సభ్యులందరూ సువార్తా పరిచర్యలో ఏకత్వమును, పవిత్రాత్మకు విధేయులుగాను, సువార్తకు సాక్షులుగా నిలబడే ధైర్యవంతులుగాను సకల జీవులకు మీ విశ్వాసపూరిత ప్రేమను అనుదినము మూర్తీభవిస్తూ ప్రకటించే వారిగాను ఉండునట్లు దీవించండి. వేదవ్యాపకము చేసే స్త్రీ పురుషులందరనూ దీవించి, వారు చేసే కృషిలో తోడుగావుంటూ వారి నమ్మకములో వారందరనూ సంరక్షించండి.

**పరిశుద్ధ మరియమ్మగారా ! వేదవ్యాపక రాణీ !** ప్రపంచ నలుమూలల జరుగు వేదవ్యాపక పరిచర్యలో తోడుగా వుండండి. మమ్ములను శాంతి సాధనాలుగా తయారుచేయండి, తమను రక్షించే వెలుగుగా క్రీస్తును ప్రపంచమంతా గుర్తించేటట్లు అనుగ్రహించండి. ఆమెన్.

† **పరిశుద్ధ లియో XIV పాపుగారు**
పునీత పౌలు పరివర్తన పండుగ
జనవరి 25, 2026
పునీత యోహాను లాటెరాను దేవాలయము, రోము.

**అనువాదము : ఫా.జాన్ రాజు,** Regional Director, PMO, Andhra Telangana States.